# అబద్ధాలు చెప్పడం మానుకోండి



నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్ రెడ్డి చేసిన వ్యాఖ్యలకు నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి ఘాటుగా స్పందించారు. గురువారం క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో తాగునీటి సమస్యపై బీఆర్ఎస్ నాయకులు ప్రజలను తప్పుదోవ పట్టించేలా అసత్య ప్రచారం చేస్తున్నారని విమర్శించారు.




శుక్రవారం 7 ఆగస్టు 2026

పేజీలు : 8

# ఆటో బ్యాటరీ చోరీ కేసు ఛేదన

అంతర్ జిల్లా దొంగల ముఠా అరెస్ట్.. నలుగురు రిమాండ్‌కు

రూ.5 వేల విలువైన బ్యాటరీ, ఆటో, పనిముట్లు, సెల్‌ఫోన్లు స్వాధీనం

ముగ్గురు నిందితులకు పాత నేర చరిత్ర.. ప్రధాన నిందితుడిపై 11 కేసులు



# పూర్తికాని హైవే

**సిద్దిపేట**

మెదక్-సిద్దిపేట-ఎలతుర్తి జాతీయ రహదారి నిర్మాణ పనుల్లో అడుగడుగునా నిర్లక్ష్యం కనిపిస్తున్నది. 2022లో రూ.1460 కోట్లతో రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించగా, మూడున్నరేండ్లు గడిచినా పూర్తికాలేదు. దీంతో రోడ్డుపై రాకపోకలకు నిత్యం ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అసంపూర్తిగా పనులు చేపట్టడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. గడువు దాటిపోయినా పనులు ఇంకా సంపూర్ణంగా పూర్తికాలేదు. కొన్నిచోట్ల పనులు పూర్తిగా నిలిచిపోగా, మరికొన్ని చోట్ల నత్తనడకన కొనసాగుతున్నాయి. ఫలితంగా రహదారి మొత్తం గుంతలు, కంకరమయంగా మారి వాహనదారులకు చుకలు చూపిస్తోంది.జాతీయ రహదారిపై చాలాచోట్ల రోడ్డు పూర్తిగా దెబ్బతిన్నది. భారీ గుంతలు ఏర్పడటంతో ద్విచక్ర వాహనదారులు అదుపు తప్పి ప్రమాదాలకు గురవుతున్నారు. వర్షం పడినప్పుడు గుంతల్లో నీరు నిలిచి వాటి లోతు కనిపించక ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. నాలుగు చక్రాల వాహనాలు తీవ్రంగా దెబ్బతింటుండడంతో వాహనదారులుకు ఆర్థికంగా భారం పడుతున్నది. నాగసముద్రం పరిసర ప్రాంతాల్లో అటవీశాఖ అనుమతుల సమస్య చూపుతూ పనులు నిలిపివేశారు. పెండింగ్ పనులు వేగంగా పూర్తిచేయ డంలో సంబంధితశాఖలు విఫలమయ్యాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. కాంట్రాక్టర్, ఎన్‌హెచ్ఏఐ, రెవెన్యూ, అటవీశాఖల మధ్య సమన్వయం లేక రోడ్డు పనుల్లో పురోగతి కరువైంది.



# విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాల పెంపుదలే లక్ష్యం

**శ్రీచైతన్య పాఠశాల-2లో ఘనంగా ఇన్వెస్టిట్యూర్ సెరిమనీ**

**ఎంఈఓ పార్వతి సత్యనారాయణ, శ్రీచైతన్య కొంపల్లి జోన్ ఏజీఎం కె. శ్రీనివాసరావు**




**తూప్రాన్ (ప్రజాజ్యోతి) ఆగస్టు 06 :** విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, బాధ్యతాయుతమైన ఆలోచన, క్రమశిక్షణను పెంపొందించే లక్ష్యంతో శ్రీచైతన్య పాఠశాల-2లో ఇన్వెస్టిట్యూర్ సెరిమనీ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తూప్రాన్ ఎంఈఓ డాక్టర్ పార్వతి సత్యనారాయణ, శ్రీచైతన్య కొంపల్లి జోన్ ఏజీఎం కె. శ్రీనివాసరావు ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థులకు ప్రేరణాత్మక సందేశాలు అందించారు.ఈ సందర్భంగా ఎంఈఓ డాక్టర్ పార్వతి సత్యనారాయణ మాట్లాడుతూ, నాయకత్వం అనేది కేవలం ఒక హోదా కాదని, బాధ్యతతో కూడిన సేవా భావమని అన్నారు. ప్రతి విద్యార్థి క్రమశిక్షణ, అంకితభావంతో చదువుతూ భవిష్యత్తులో ఐఏఎస్, ఐపీఎస్, వైద్యులు, ఇంజినీర్లు వంటి ఉన్నత స్థానాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. శ్రీచైతన్య కొంపల్లి జోన్ ఏజీఎం కె. శ్రీనివాసరావు మాట్లాడుతూ, విద్యార్థులు పట్టుదల, నిజాయితీ, సేవా దృక్పథం, నాయకత్వ లక్షణాలను అలవర్చుకుని జీవితంలో ఉన్నత శిఖరాలను చేరుకోవాలని సూచించారు. విద్యతో పాటు వ్యక్తిత్వ వికాసం, సామాజిక బాధ్యత, నాయకత్వ నైపుణ్యాల అభివృద్ధికి శ్రీచైతన్య విద్యాసంస్థలు ఎల్లప్పుడూ ప్రాధాన్యం ఇస్తాయని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా ఎన్నికైన స్కూల్ కెప్టెన్, వైస్ కెప్టెన్, హౌస్ కెప్టెన్లు, హౌస్ వైస్ కెప్టెన్లు మరియు ఇతర విద్యార్థి నాయకులకు బ్యాడ్జీలు, శాష్‌లు ధరింపజేసి ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ మల్లికార్జున్ రెడ్డి, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

# అబద్ధాలు చెప్పడం మానుకోండి

**-బహిరంగ చర్చకు సిద్ధమా?**

**-- మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డికి ఎమ్మెల్యే సంజీవరెడ్డి సవాల్**



**నారాయణఖేడ్, ప్రజాజ్యోతి ఆగస్టు 6:** నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్ రెడ్డి చేసిన వ్యాఖ్యలకు నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి ఘాటుగా స్పందించారు. గురువారం క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో తాగునీటి సమస్యపై బీఆర్ఎస్ నాయకులు ప్రజలను తప్పుదోవ పట్టించేలా అసత్య ప్రచారం చేస్తున్నారని విమర్శించారు.

నియోజకవర్గంలోని 120 గ్రామాలు, తండాలకు బోరంచ-- గూడూర్ ప్రాంతాల నుంచి తాగునీరు అందించే కార్యక్రమానికి దివంగత మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల కిష్టారెడ్డి శ్రీకారం చుట్టారని, అప్పటి ఉమ్మడి జిల్లా కలెక్టర్ స్మితా సబర్వాల్ సహకారంతో ఆ పనులు ప్రారంభమయ్యాయని గుర్తు చేశారు. ఆ చరిత్రను విస్మరించి బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చిన తర్వాతే తాగునీరు వచ్చిందని చెప్పడం పూర్తిగా అవాస్తవమని అన్నారు. మిషన్ భగీరథ పేరుతో వేల కోట్ల రూపాయలు ఖర్చు చేశామని చెప్పుకునే బీఆర్ఎస్ ప్రభుత్వం గ్రామాలకు నాణ్యమైన తాగునీరు అందించడంలో విఫలమైందని ఆరోపించారు. మిషన్ భగీరథ కింద ఏర్పాటు చేసిన మోటార్లు, పరికరాలు తక్కువ కాలంలోనే మరమ్మతులకు గురై ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న విషయాన్ని ప్రజలు మరచిపోలేదన్నారు. సింగూర్ ప్రాజెక్టు మరమ్మత్తుల కారణంగా ఈ ఏడాది తాగునీటి సమస్య వచ్చే అవకాశాన్ని ముందుగానే గుర్తించి అధికారులతో ప్రత్యేక సమీక్షలు నిర్వహించి, అవసరమైన చోట కొత్త బోర్లు వేయించి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకున్నామని తెలిపారు. దీంతో వేసవికాలంలో నియోజకవర్గంలోని ఏ గ్రామంలోనూ తీవ్రమైన తాగునీటి సమస్య రాలేదన్నారు. జొన్న రైతులకు బకాయిల చెల్లింపులు జరగబోతున్న విషయం ముందే తెలిసి, ఒక రోజు ముందు ప్రెస్‌మీట్ పెట్టి తమ వల్లే నిధులు విడుదలయ్యాయని చెప్పడం హాస్యాస్పదమని మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డిని విమర్శించారు. అలాగే నల్లవాగు ప్రాజెక్టు నీటి విడుదల కూడా తమ ఒత్తిడి వల్లే జరిగిందని ప్రచారం చేయడం అసత్యమన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో కాంగ్రెస్ హయాంలో నిర్మించిన రోడ్లకు కనీస మరమ్మతులు కూడా చేయలేదని, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం రెండేళ్లలోనే అభివృద్ధి పనులను వేగవంతం చేస్తోందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీల అమలే తమ ప్రభుత్వ లక్ష్యమని, గ్రామాలు, తండాలకు శాశ్వత తాగునీటి సౌకర్యంతో పాటు దెబ్బతిన్న రహదారులను దశలవారీగా అభివృద్ధి చేస్తామని చెప్పారు. ఆరోగ్యశ్రీ పథకానికి రూ. 400 కోట్లు చెల్లించామని, 19వ ప్యాకేజీకి బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా చెల్లించలేదని ఆరోపించారు. నారాయణఖేడ్ ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిని గత పాలనలో పూర్తిగా నిర్వీర్యం చేశారని, భూపాల్ రెడ్డి ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశాలు నిర్వహించలేదని అన్నారు. తాను ఎమ్మెల్యేగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ప్రతి మూడు నెలలకు ఒకసారి ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశాలు నిర్వహిస్తూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు. ఏ అంశంపైనైనా బహిరంగ చర్చకు సిద్ధమా అంటూ మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డికి ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి సవాల్ విసిరారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ దారం శంకర్, కౌన్సిలర్లు వివేకానంద, షారుక్ ఖాన్, బాణాపూర్ రాజు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు తాహేర్ అలీ, విట్టల్ రావు, సుభూర్, గోపాల్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ పండరి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ సర్టిఫికెట్ వెరిఫికేషన్‌లో గందరగోళం

**దరఖాస్తుదారుల అవస్థలు..**

**లోకల్ సర్టిఫికెట్‌లో ఇంటి పేరు అంశంపై స్పష్టత లేక అయోమయం**

**అధికారులు,మీ సేవా కేంద్రాల చుట్టూ ప్రదక్షిణలు**




**శివ్వంపేట ప్రజాజ్యోతి ఆగస్టు 6:** అంగన్వాడీ టీచర్,ఆయా పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు గురువారం నిర్వహించిన సర్టిఫికెట్ వెరిఫికేషన్ సందర్భంగా గందరగోళానికి గురయ్యారు.నిబంధనలపై స్పష్టత లేకపోవడంతో అధికారుల కార్యాలయం,మీ సేవా కేంద్రాల చుట్టూ తిరుగుతూ అవస్థలు పడ్డారు. శివ్వంపేట మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో అంగన్వాడీ టీచర్,ఆయా పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల సర్టిఫికెట్లను అధికారులు పరిశీలించారు.ఈ సందర్భంగా స్థానికత ధ్రువీకరణ పత్రంలో (లోకల్ సర్టిఫికెట్) దరఖాస్తుదారుడి పేరుకు ముందు భర్త ఇంటి పేరు కాకుండా తండ్రి ఇంటి పేరు ఉండాలని అధికారులు సూచించినట్లు అభ్యర్థులు తెలిపారు.పెళ్లి అనంతరం భర్త ఇంటిపేరు,భర్త పేరు నమోదు చేయించుకున్న మహిళలు ఒక్కసారిగా అయోమయానికి గురయ్యారు.సర్టిఫికెట్లలో మార్పులు చేయించుకోవడానికి అధికారులు,మీ సేవా కేంద్రాల చుట్టూ తిరగాల్సి రావడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నామని వారు వాపోయారు.ఈ విషయమై అంగన్వాడీ సూపర్వైజర్ సంతోషినిని వివరణ కోరగా,అభ్యర్థులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు.సర్టిఫికెట్ల అంశంపై పై అధికారులతో మాట్లాడి తగిన మార్గదర్శకాలు తీసుకుంటామని, అవసరమైన సమయం ఉన్నందున అభ్యర్థులు ఆందోళన చెందవద్దని ఆమె సూచించారు.

## ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో 560 యూరియా బస్తాలు అందుబాటులో



**కల్హే ర్ , ఆగస్టు 6: ప్రజా జ్యోతి** సంగారెడ్డి జిల్లా కల్హేర్ మండలంలోని బీబీపేట్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్)లో 560 యూరియా బస్తాలు అందుబాటులో ఉన్నట్లు పీఏసీఎస్ కార్యదర్శి రామచంద్రర్ తెలిపారు. యూరియా అవసరమున్న రైతులు ఈరోజు మధ్యాహ్నం 3 గంటలకు సంబంధిత యాప్ ద్వారా బుకింగ్ చేసుకోవాలని ఆయన సూచించారు. సంఘం పరిధిలోని రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాల కోసం రైతులు సంబంధిత పీఏసీఎస్ కార్యాలయాన్ని సంప్రదించాలని కార్యదర్శి సూచించారు

## తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతిని

ఘనంగా నిర్వహించిన జహీరాబాద్ మున్సిపాలిటి



**జహీరాబాద్, ఆగస్టు 06(ప్రజా జ్యోతి న్యూస్)** తెలంగాణ రాష్ట్ర సాధనకు తన జీవితాన్నే అంకితం చేసిన తెలంగాణ సిద్ధాంతకర్త, ఉద్యమ మేధావి ప్రొఫెసర్ కొత్తపల్లి జయ శంకర్ జయంతి సందర్భంగా గురువారం జహీరాబాద్ మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఘనంగా జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మహమ్మద్ యూనుస్, కమీషనర్ ప్రభాకర్ ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కొబ్బరికాయ కొట్టి జయంతి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మహమ్మద్ యూనుస్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి ప్రొఫెసర్ జయశంకర్ అందించిన సేవలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతా యని అన్నారు. తెలంగాణ ప్రజల హక్కులు, ఆత్మగౌరవం కోసం ఆయన జీవితాంతం శాస్త్రీయంగా, ప్రజాస్వామ్యబద్ధంగా పోరాటం చేశారని కొనియాడారు. నేటి యువత ప్రొఫెసర్ జయశంకర్ ఆశయాలను ఆదర్శంగా తీసుకొని సమాజాభివృద్ధి, రాష్ట్ర అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్లు, సిబ్బంది జయశంకర్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఆయన సేవలను స్మరించుకున్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన లో ఆయన చూపిన దురదృష్టి, నిబద్ధత, త్యాగస్ఫూర్తి ప్రతి తరానికి మార్గ దర్శకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రభాకర్, కౌన్సిలర్లు జహంగీర్, ఖాజమీయా, తంజీమ్, జమీలుద్దీన్, శ్రీధర్ రెడ్డి, అక్రమ్, గౌస్ గౌరీ,రఫీలి మున్సిపల్ అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతి నిధులు, మరియు తదితరులు పాల్గొని ప్రొఫెసర్ జయశంకర్ కు ఘనా నివాళు లర్పించారు. కార్యక్రమం అనంతరం తెలంగాణ ఉద్యమంలో ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకుంటూ ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని పాల్గొన్నవారు సంకల్పం వ్యక్తం చేశారు.

## తెలంగాణ సాధనలో ప్రముఖుడు ప్రో.జయశంకర్ సార్.

తెలంగాణ ఉద్యమకారులను ప్రభుత్వం ఆదుకోవాలి.

తెలంగాణ ప్రజాశక్తి పార్టీ రాష్ట్ర అధ్యక్షులు దొడ్డ వెంకట్



**సంగారెడ్డి (ప్రజా జ్యోతి)** ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతి నీ పురస్కరించుకొని తెలంగాణ ప్రజాశక్తి పార్టీ రాష్ట్ర అధ్యక్షులు దొడ్డ వెంకట్ పార్టీ కార్యాలయంలో చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..తెలంగాణ వెనుకబాటుతనానికి గల కారణాలను నీటి, నిధుల, నియామకాల కోణంలో తెలంగాణకు 1956నుంచి జరుగుతున్న అన్యాయాన్ని గణాంకాలతో వివరించిన గొప్ప మేధావి జయశంకర్ సార్,అదేవిధంగా తెలంగాణ ఉద్యమానికి మేధో నాయకత్వం వహించారు.మిలియన్ మార్చ్,సాగరహారం వంటి అనేక ఉద్యమాల్లో కీలక పాత్ర పోషించిన గొప్ప ఘనుడు, తెలంగాణ రాష్ట్ర సాధించేదాక వివాహం చేసుకోను అని కంకణం కట్టుకున్న గొప్ప వ్యక్తి జయశంకర్ సార్ అని, అంతే కాకుండా నీళ్ళు,నిధులు,నియామకాలు తెలంగాణ ప్రజల హక్కుగా లేవనెత్తి యావత్ తెలంగాణ రాష్ట్ర ప్రజలను ఒక్క తాటిపైకి తెచ్చిన మహనీయుడు 2011 లో తన కల నెరవేరకముందే చనిపోవడం బాధాకరం. రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులను దృష్టిలో పెట్టుకొని వారికి అన్నివిధాలుగా ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నానని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం జిల్లా నాయకులు పంచలింగాల రాజు, బీసీ సంఘం పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ పరిగి శ్రీనివాస్,పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## సదాశివపేట శాంతినికేతన్ విద్యాలయంలో ఘనంగా "హరితహారం".. వృక్షాకారంలో ఆకట్టుకున్న విద్యార్థులు!




**సంగారెడ్డి (ప్రజా జ్యోతి)** సంగారెడ్డి జిల్లా సదాశివపేట పట్టణంలోని శాంతినికేతన్ విద్యాలయంలో హరితహారం కార్యక్రమాన్ని చాలా ఉత్సాహంగా నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ మాలి పటేల్ అరవిందశ్రీ, ప్రిన్సిపాల్ సుప్రియ నేతృత్వంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు భాగస్వాములై పర్యావరణ పరిరక్షణపై పిలుపునిచ్చారు. ?శాంతినికేతన్ పాఠశాల ప్రాంగణంలో విద్యార్థులు పర్యావరణ చైతన్యాన్ని చాటుతూ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా విద్యార్థులందరూ క్రమపద్ధతిలో "వృక్షాకారం" (చెట్టు రూపం) లో కూర్చుని చెట్లు నాటాలనే సందేశాన్ని వినూత్నంగా ప్రదర్శించి అందరినీ ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి పాఠశాల కరస్పాండెంట్ అరవిందశ్రీ మాట్లాడుతూ... ?"ప్రతి ఒక్కరూ కనీసం ఒక చెట్టు నాటి వర్షపాతాన్ని పెంపొందించడానికి కృషి చేయాలి. సకాలంలో వర్షాలు కురిస్తేనే పంటలు బాగా పండుతాయి, పంటలు పండితేనే రైతు సంతోషంగా ఉంటాడు. రైతు ఆనందంగా ఉంటేనే దేశం సుభిక్షంగా ఉంటుంది." ?అని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ తమ జన్మదినం సందర్భంగా కనీసం ఒకటి లేదా రెండు మొక్కలు నాటి, వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఈ హరితహారం కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సుప్రియ, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు మరియు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి నివాళులర్పించిన కోహిర్ మున్సిపల్ చైర్మన్ ఎం.అశోక్

కార్యక్రమంలో పాల్గొన్న కమిషనర్, కౌన్సిలర్లు, సిబ్బంది



**జహీరాబాద్, ఆగస్టు 06(ప్రజా జ్యోతి న్యూస్)** ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతి సందర్భంగా గురువారం కోహిర్ మున్సిపల్ చైర్మన్ ఎం.అశోక్ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్, కౌన్సిలర్లతో కలిసి మున్సిపల్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళుల ర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎం.అశోక్ మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర సాధనకు తన జీవితాన్నే అంకితం చేసిన మహనీయుడని, తెలంగాణ ప్రజల ఆత్మగౌరవం కోసం, ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం జీవితాంతం అలుపెరగని పోరాటం చేసిన మహనీయుడు ప్రొఫెసర్ జయశంకర్ అని అన్నారు. తెలంగాణ ఉద్యమానికి ఆయన సిద్ధాంతపరంగా బలమైన పునాది వేశారని, ఆయన ఆలోచనలు తరతరాలకు ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు. తెలంగాణ అభివృద్ధి, సామాజిక న్యాయం, సమాన అవకాశాల కోసం ఆయన చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, ఆయా వార్డుల కౌన్సిలర్లు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పత్తికి నానో బలం.. తక్కువ ఎరువుతో ఎక్కువ దిగుబడే లక్ష్యం

వటపల్లిలో నానో డీఏపీ, నానో యూరియా వినియోగంపై క్షేత్ర ప్రదర్శన

వ్యవసాయ శాఖ సూచనలతో రైతులకు అవగాహన

**అందోల్, ఆగస్టు 6 (ప్రజాజ్యోతి):** వ్యవసాయంలో ఆధునిక సాంకేతికతను రైతులకు చేరువ చేయడంతో పాటు ఎరువుల వినియోగాన్ని శాస్త్రీయ పద్ధతిలో ప్రోత్సహించేందుకు వ్యవసాయ శాఖ చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి మండలం గొర్రెకల్ గ్రామంలో పత్తి పంటలో నానో డీఏపీ, నానో యూరియా వినియోగంపై గురువారం క్షేత్ర ప్రదర్శన నిర్వహించారు. రాయికోడ్ వ్యవసాయ సహాయ సంచాలకులు ఏడీఏ శ్రీనివాస్ ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రైతులకు నానో ఎరువుల ప్రయోజనాలను ప్రత్యక్షంగా వివరించారు. ఈ సందర్భంగా ఏడీఏ శ్రీనివాస్ ప్రసాద్ మాట్లాడుతూ.. నానో యూరియా, నానో డీఏపీ వాడకం ద్వారా మొక్కలకు అవసరమైన పోషకాలు సమర్థవంతంగా అందుతాయని తెలిపారు. ఆకులపై పిచికారీ చేసే ఈ ఎరువులు మొక్కల ఎదుగుదలను వేగవంతం చేయడంతో పాటు పంట దిగుబడి, నాణ్యత పెంచడంలో కీలక పాత్ర పోషిస్తాయని చెప్పారు. సాంప్రదాయ ఎరువులతో పోలిస్తే నానో



ఎరువుల వినియోగం వల్ల ఎరువుల వృథా గణనీయంగా తగ్గుతుందని, భూసారం పరిరక్షణతో పాటు పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించడంలో కూడా ఇవి దోహదపడతాయని వివరించారు. వ్యవసాయ శాఖ సూచించిన మోతాదు, సరైన దశలో నానో ఎరువులను వినియోగిస్తే మెరుగైన ఫలితాలు సాధించవచ్చని రైతులకు సూచించారు.

క్షేత్ర ప్రదర్శనలో మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ రెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారి ప్రవీణ్ రైతులకు నానో ఎరువుల పిచికారీ విధానం, వినియోగ సమయం, జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. రైతులు పలు సందేహాలు అడిగి నివృత్తి చేసుకోగా, ఆధునిక వ్యవసాయ పద్ధతులను అనుసరించి అధిక దిగుబడులు సాధించాలని అధికారులు పిలుపునిచ్చారు.

గొర్రెకల్ గ్రామానికి చెందిన పలువురు రైతులు కార్యక్రమంలో పాల్గొని క్షేత్ర ప్రదర్శనను ఆసక్తిగా వీక్షించారు. వ్యవసాయంలో కొత్త సాంకేతికతలపై ఇలాంటి అవగాహన కార్యక్రమాలు మరింతగా నిర్వహించాలని రైతులు కోరారు.

# ఆటో బ్యాటరీ చోరీ కేసు ఛేదన

**అంతర్ జిల్లా దొంగల ముఠా అరెస్ట్.. నలుగురు రిమాండ్‌కు**

**రూ.5 వేల విలువైన బ్యాటరీ, ఆటో, పనిముట్లు, సెల్‌ఫోన్లు స్వాధీనం**

**ముగ్గురు నిందితులకు పాత నేర చరిత్ర.. ప్రధాన నిందితుడిపై 11 కేసులు**



**అందోల్, ఆగస్టు 6 (ప్రజాజ్యోతి):** సంగారెడ్డి జిల్లా జోగిపేట పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి ఆటో బ్యాటరీ చోరీ కేసును ఛేదించారు. అందోల్ మండలం డాకూర్ గ్రామంలో ఆటోలోని బ్యాటరీని చోరీ చేసిన అంతర్ జిల్లా దొంగల ముఠాకు చెందిన నలుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుల నుంచి చోరీ చేసిన బ్యాటరీతో పాటు నేరానికి ఉపయోగించిన ఆటో, ఐరన్ రాడ్, స్క్రూ డ్రైవర్, నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

పోలీసుల వివరాల ప్రకారం.. డాకూర్ గ్రామానికి చెందిన షేక్ మహబూబ్ ఈ నెల 4న తన పశువుల షెడ్‌లో ఆటోను నిలిపి ఉంచాడు. అర్ధరాత్రి సమయంలో గేటు తాళం పగులగొట్టి లోపలికి ప్రవేశించిన దుండగులు ఆటోను దొంగిలించేందుకు యత్నించారు. అది సాధ్యం కాకపోవడంతో ఆటోలో ఉన్న రూ.5 వేల విలువైన బ్యాటరీని తీసుకుని పరారయ్యారు. బాధితుడి ఫిర్యాదుతో జోగిపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

దర్యాప్తులో భాగంగా గురువారం తలెల్మ గ్రామం సమీపంలో ఎస్ఐ గిరి శ్రీకాంత్ ఆధ్వర్యంలో పోలీసులు వాహనాల తనిఖీలు చేపట్టారు. నంబర్ ప్లేట్‌పై బురద పూసి అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఆటోను ఆపి విచారించగా, డాకూర్ గ్రామంలో బ్యాటరీ చోరీ చేసినట్లు నిందితులు అంగీకరించారు.

అరెస్ట్ అయిన వారిలో హైదరాబాద్‌కు చెందిన మహమ్మద్ గౌస్ పాషా, మహమ్మద్ షఫీ అహ్మద్, జహీరాబాద్‌కు చెందిన మహమ్మద్ జమీలుద్దీన్, వట్‌పల్లికి చెందిన బాగ్గీ మైనొద్దీన్ ఉన్నారు. నిందితుల నుంచి చోరీ సొత్తుతో పాటు నేరానికి ఉపయోగించిన సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు.

జోగిపేట సీఐ అనిల్ కుమార్ మాట్లాడుతూ.. అరెస్ట్ అయిన వారిలో ముగ్గురు పాత నేరస్థులని తెలిపారు. ప్రధాన నిందితుడు మహమ్మద్ గౌస్ పాషాపై హైదరాబాద్ నగరంలోని వివిధ పోలీస్ స్టేషన్లలో 11 కేసులు నమోదై ఉన్నాయని, మిగిలిన ఇద్దరు నిందితులపై కూడా పలు నేర కేసులు ఉన్నట్లు వెల్లడించారు. ప్రజలు తమ వాహనాలను సురక్షిత ప్రదేశాల్లో నిలిపి ఉంచడంతో పాటు అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఆయన సూచించారు.

## కేజీబీవీ కొండాపూర్‌లో 'బేటీ బచావో బేటీ పడావో' ఆధ్వర్యంలో బాలికలకు అవగాహన కార్యక్రమం...




**కొండాపూర్ ప్రజా జ్యోతి** బాలికల ఆరోగ్యం, భద్రత, విద్య, సాధికారత లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వ 'బేటీ బచావో -- బేటీ పడావో' కార్యక్రమంలో భాగంగా కొండాపూర్ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు రుతుక్రమ పరిశుభ్రత స్వీయ రక్షణ, శారీరక, మానసిక, సామాజిక వికాసం వంటి అంశాలపై సమగ్ర అవగాహన కల్పించారు. యుక్తవయస్సులో తీసుకోవాల్సిన ఆరోగ్య జాగ్రత్తలు, వ్యక్తిగత పరిశుభ్రత, పోషకాహారం, మానసిక ఆరోగ్యం, ఆత్మవిశ్వాసం పెంపొందించుకోవడం, విద్య ద్వారా ఉన్నత లక్ష్యాలను చేరుకోవడం వంటి విషయాలను వివరించారు.కార్యక్రమానికి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. లత దేవి, జిల్లా మహిళా సంక్షేమ అధికారి లలిత కుమారి,సీడీపీఓ తో పాటు మండల స్థాయి అధికారులు హాజరయ్యారు. వారు విద్యార్థినులతో ముఖాముఖి మాట్లాడి ఆరోగ్యం, భద్రత, విద్య, మహిళా సాధికారత ప్రాముఖ్యతను వివరించారు. ప్రతి బాలిక తన హక్కులను తెలుసుకుని ఆరోగ్యవంతమైన జీవనశైలిని అలవర్చుకోవాలని, ఆత్మవిశ్వాసంతో ఉన్నత లక్ష్యాల వైపు ముందుకు సాగాలని సూచించారు.పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిబ్బంది సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొని అధికారులు తెలిపిన సూచనలు, సలహాలను ఆసక్తిగా ఆలకించారు. బాలికల్లో ఆరోగ్య అవగాహనతో పాటు ఆత్మరక్షణ, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేందుకు ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగపడిందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సౌమ్యశ్రీ, ఉపాధ్యాయులు, అధికారులు, విద్యార్థులు

## తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ ఆశయాలు చిరస్మరణీయం.

**వనపర్తి :** వనపర్తి క్యాంపు కార్యాలయంలో ఘనంగా జయంతి వేడుకలు.తెలంగాణ సిద్ధాంతకర్త, మేధావి, ఉద్యమ స్ఫూర్తి ప్రదాత ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతి సందర్భంగా వనపర్తి క్యాంపు కార్యాలయంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మధు గౌడ్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు కదిరే రాములు ఆధ్వర్యంలో ఘనంగా జయంతి వేడుకలు నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర సాధనకు ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన మహనీయుడిగా, తన జీవితమంతా తెలంగాణ కోసం అంకితం చేసిన మహోన్నత వ్యక్తిగా ఆయన చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతారని పేర్కొన్నారు.తెలంగాణకు జరిగిన అన్యాయాలను శాస్త్రీయ ఆధారాలతో దేశం ముందు వివరించి, ప్రత్యేక రాష్ట్ర అవసరాన్ని బలంగా వినిపించిన గొప్ప మేధావి జయశంకర్ అని కొనియాడారు.ఆయన చూపిన మార్గంలోనే తెలంగాణ ఉద్యమం ముందుకు సాగి ప్రత్యేక రాష్ట్రం సాకారమైందని గుర్తు చేశారు.నేటి యువత ప్రొఫెసర్ జయశంకర్ ఆశయాలను ఆదర్శంగా తీసుకుని సమాజాభివృద్ధికి కృషి చేయాలని, తెలంగాణ అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని పిలుపునిచ్చార

## రూ.1.50 లక్షల ఎల్‌ఓసి అందజేసిన ఎమ్మెల్యే మాణిక్ రావు




**జహీరాబాద్, ఆగస్టు 06(ప్రజా జ్యోతి న్యూస్)** ఇటీవల అనారోగ్యానికి గురై హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఝరాసంగం మండల కేంద్రానికి చెందిన మల్లర్ సంగమేశ్వర్, తండ్రి శంకరయ్యకి అత్యవసర వైద్య చికిత్స నిమిత్తం ముఖ్య మంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) కింద రూ. 1,50,000/- విలువైన ఎల్ఓసి మంజూరు చేయించారు. మంజూరైన ఎల్ఓసి గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మాజీ మార్కెట్ చైర్మన్ గుండప్ప, మాజీ ఆత్మ చైర్మన్ విజయ్ కుమార్, గ్రామ సర్పంచ్ బాల్ రాజ్, నాగేశ్వర్, సజ్జన్, శ్రీను పటేల్‌లిలి గార్లతో కలిసి జహీరాబాద్ శాసనసభ్యులు కొనింటి మాణిక్ రావు లబ్ధిదారుడికి అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారుడు కుటుంబ సభ్యులు తమకు ఆపద సమయంలో అండగా నిలిచి, వైద్య చికిత్సకు ఆర్థిక సహాయం అందేలా కృషి చేసిన ఎమ్మెల్యే కొనింటి మాణిక్ రావు కి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

## తెలంగాణ సాధనలో ప్రముఖుడు ప్రొ.జయశంకర్ సార్.

**తెలంగాణ ఉద్యమకారులను ప్రభుత్వం ఆదుకోవాలి.**

**తెలంగాణ ప్రజాశక్తి పార్టీ రాష్ట్ర అధ్యక్షులు దొడ్ల వెంకట్**




**సంగారెడ్డి (ప్రజా జ్యోతి)** ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతి నీ పురస్కరించుకొని తెలంగాణ ప్రజాశక్తి పార్టీ రాష్ట్ర అధ్యక్షులు దొడ్ల వెంకట్ పార్టీ కార్యాలయంలో చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..తెలంగాణ వెనుకబాటుతనానికి గల కారణాలను నీటి, నిధుల, నియామకాల కోణంలో తెలంగాణకు 1956నుంచి జరుగుతున్న అన్యాయాన్ని గణాంకాలతో వివరించిన గొప్ప మేధావి జయశంకర్ సార్,అదేవిధంగా తెలంగాణ ఉద్యమానికి మేధో నాయకత్వం వహించారు.మిలియన్ మార్చ్,సాగరహారం వంటి అనేక ఉద్యమాల్లో కీలక పాత్ర పోషించిన గొప్ప ఘనుడు, తెలంగాణ రాష్ట్ర సాధించేదాక వివాహం చేసుకోను అని కంకణం కట్టుకున్న గొప్ప వ్యక్తి జయశంకర్ సార్ అని, అంతే కాకుండా నీళ్ళు,నిధులు,నియామకాలు తెలంగాణ ప్రజల హక్కుగా లేవనెత్తి యావత్ తెలంగాణ రాష్ట్ర ప్రజలను ఒక్క తాటిపైకి తెచ్చిన మహనీయుడు 2011 లో తన కల నెరవేరకముందే చనిపోవడం బాధాకరం. రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులను దృష్టిలో పెట్టుకొని వారికి అన్నివిధాలుగా ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నానని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం జిల్లా నాయకులు పంచలింగాల రాజు, బీసీ సంఘం పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ పరిగి శ్రీనివాస్,పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.